
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
బుధవారం । 21 । ఫిబ్రవరి । 2024



సోమశిలలో 19.967 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో మంగళవారం సాయంత్రానికి 19.697 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వివిధ కాలువలకు 3,500 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	- రూ.64,000
22 క్యారెట్లు ఆర్నమెంట్ (గ్రా)	- రూ.5,747
3 శాతం జీఎస్టీతో..	- రూ.5,919
నవర (8 గ్రా)	- రూ.47,352

గరిష్టం/కనిష్టం
33.5 /24.1

వాతావరణం

మంగళవారం గాలిలో తేమ 69 శాతం ఉంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతున్నాయి. బుధవారం పెద్దగా మార్పులు ఉండబోవని వాతావరణశాఖ తెలిపింది.

వైఎస్సార్ కళ్యాణమస్తు, షాదీ తోఫాతో లబ్ధి

- జిల్లాలో 490 మంది కొత్త జంటలకు రూ.4.09 కోట్లు జమ
- ఆడపిల్లల పెళ్లి తల్లిదండ్రులకు భారం కాకుండా ఆర్థికసాయం
- ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్ చక్రవర్తి



షాదీ తోఫా నమూనా చెక్కును అందజేస్తున్న కలెక్టర్, జెడ్పీ చైర్‌పర్సన్, ఎమ్మెల్సీ

నెల్లూరు(దర్గామిట్ట): రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ కళ్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా పథకాల ద్వారా ఆడపిల్లల పెళ్లి కోసం వారి తల్లిదండ్రులకు అండగా నిలుస్తోందని ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్ చక్రవర్తి పేర్కొన్నారు. మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా వైఎస్సార్ కళ్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా పథకాలకు సంబంధించిన ఆర్థికసాయాన్ని తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారు. ఈ కార్యక్రమానికి కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణం నుంచి జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, కలెక్టర్ ఎం.హరినారాయణన్, అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ జిల్లాలోని 409 జంటలకు సంబంధించిన రూ.4.09 కోట్ల ఆర్థిక సహాయాన్ని ఆడపిల్లల తల్లిదండ్రుల ఖాతాల్లో సీఎం జమ చేశారన్నారు. గత సంవత్సరం అక్టోబర్, నవంబర్, డిసెంబర్ నెలల్లో వివాహాలు చేసుకున్న వివిధ వర్గాల వారికి ఈ ఆర్థికసాయం అందజేశారని తెలిపారు. నిరుపేద తల్లిదండ్రులు వారి ఆడపిల్లల వివాహాన్ని అప్పులపాలు కాకుండా గౌరవప్రదంగా చేసేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ కళ్యాణమస్తు, షాదీ తోఫా పథకాలను అమలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి, జిల్లా బీసీ సంక్షేమ అధికారి వెంకటయ్య, ఎస్సీ సంక్షేమ సాధికారిత అధికారి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఇంటర్ ప్రాక్టికల్స్

నెల్లూరు(టౌన్): ఇంటర్ ప్రాక్టికల్స్ మంగళవారంతో ముగిశాయి. ఈ నెల 5వ తేదీ నుంచి ఒకేషనల్, 11వ తేదీ నుంచి జనరల్ విద్యార్థులకు ప్రాక్టికల్స్ పరీక్షలు జరిగాయి. వీటికి 21 వేల మందికి పైగా హాజరయ్యారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల నిర్వహించారు.



ప్రాక్టికల్స్‌ను పరిశీలిస్తున్న అధికారులు

మరువలేని జ్ఞాపకం గౌతమ్‌రెడ్డి

- దివంగత మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి స్మారక చిహ్నం, పార్కు నిర్మాణానికి భూమిపూజ నేడే
- ద్వితీయ వర్ధంతికి ఉదయగిరి వ్యవసాయ కళాశాలలో ఏర్పాట్లు
- భారీగా తరలిరానున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు, అభిమానులు

ఉదయగిరి: మరువలేని మనీషి దివంగత మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి ద్వితీయ వర్ధంతిని పురస్కరించుకుని బుధవారం ఉదయగిరిలోని మేకపాటి గౌతమ్‌రెడ్డి వ్యవసాయ కళాశాల ఆవరణలో ఆయన పేరుతో స్మారక చిహ్నం, పార్కు నిర్మాణానికి భూమిపూజ చేయనున్నారు. అనంతరం కళాశాల ప్రాంగణంలో గౌతమ్‌రెడ్డి రెండో వర్ధంతి కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ఉదయగిరి, ఆత్మకూరు నియోజకవర్గాల నుంచి వైఎస్సార్‌సీపీ శ్రేణులు, మేకపాటి కుటుంబ అభిమానులు భారీగా తరలిరానున్నారు. ఈ కార్యక్రమ ఏర్పాట్లను మంగళవారం మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి, ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి పరిశీలించారు. ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు చేయాలని సన్నిహితులకు సూచించారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ వ్యవసాయ కళాశాల ఆవరణలోని మూడెకరాల విస్తీర్ణంలో దివంగత మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి జ్ఞాపకార్థం రూ.7 కోట్ల వ్యయంతో స్మారక చిహ్నం, పార్కు నిర్మిస్తున్నట్లు తెలిపారు. కళాశాల ముఖ ద్వారం వద్ద గౌతమ్‌రెడ్డి విగ్రహం కూడా ఏర్పాటు చేస్తామని తెలిపారు. గౌతమ్‌రెడ్డి కుటుంబసభ్యులకు, ప్రజలకు దూరమై రెండేళ్లు గడిచిపోయాయని, ఆయన మన మధ్య లేకపోవడం తీరనిలోటని అన్నారు. చిన్న వయస్సులోనే ఆత్మకూరు, ఉదయగిరి ప్రాంతాల ప్రజలకు ఉపయోగపడే ఎన్నో కార్యక్రమాలు చేశారని గుర్తుచేశారు.



వ్యవసాయ కళాశాల ప్రాంగణంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న రాజమోహన్‌రెడ్డి, విక్రమ్‌రెడ్డి

సోమశిల హైలెవల్ కెనాల్ ఫేజ్-2 పనులకు నిధుల మంజూరు, పారిశ్రామికవాడ సాధనతో పాటు ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి ప్రజల్లో మంచి గుర్తింపు తెచ్చుకున్నారని తెలిపారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంచి మనస్సుతో గౌతమ్‌రెడ్డి జిల్లా ప్రజలకు చిరకాలం గుర్తుండిపోయేలా సంగం బ్యారేజీకి మేకపాటి గౌతమ్‌రెడ్డి సంగం బ్యారేజీగా నామకరణం చేయడం అభినందనీయమన్నారు. ఉదయగిరిలో రూ.260 కోట్ల విలువ చేసే మెరిట్స్ కాలేజీని తాము ప్రభుత్వానికి ఇచ్చామని, దానిని మేకపాటి గౌతమ్‌రెడ్డి వ్యవసాయ కళాశాలగా మార్చడం పట్ల సీఎంకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. భవిష్యత్‌లో ఈ కళాశాల వ్యవసాయ యూనివర్సిటీగా రూపొందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గౌతమ్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా సంగీత విభావరి, ప్రవచనాలు, ప్రముఖ గాయకులతో అన్నమాచార్య కీర్తనలు, భక్తి గీతాల ఆలాపన, ప్రముఖ నృత్యకారిణి మహేశ్వరి భరతనాట్య కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. మహిళలకు చిరుకానుక అందజేయడంతోపాటు భోజన సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల డీన్ టి.గోపీకృష్ణ, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు గాజుల తాజుద్దీన్, కలిగిరి జెడ్పీటీసీ సభ్యుడు పాలూరి మాల్యాద్రిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు అక్కి భాస్కర్‌రెడ్డి, అశోక్‌కుమార్, షర్ఫుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

అజాత శత్రువు గౌతమన్న

- ఆయనతో కలిసి నడిచిన రోజులు గుర్తుచేసుకుంటున్న అభిమానులు

ఆత్మకూరు: దివంగత పరిశ్రమల శాఖ మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి అజాత శత్రువుగా పేరు తెచ్చుకున్నారు. ప్రజలకు దూరమై రెండేళ్లవుతున్నప్పటికీ ఆయన జ్ఞాపకాలను వైఎస్సార్‌సీపీ శ్రేణులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు మరువలేకున్నారు. ఆయనతో కలిసి నడిచిన రోజులను గుర్తుచేసుకుంటున్నారు. బుధవారం గౌతమ్‌రెడ్డి 2వ వర్ధంతిని పురస్కరించుకుని ఉదయగిరిలోని వ్యవసాయ కళాశాలలో నిర్వహించే కార్యక్రమానికి పార్టీ శ్రేణులు, అభిమానులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరుకానున్నారు.

చిరునవ్వు, ఆప్యాయతల కలబోత

ప్రతి ఒక్కరినీ ఎంతో ఆదరాభిమానాలతో పలకరించే మేకపాటి గౌతమ్‌రెడ్డి చిరునవ్వు, ఆప్యాయతల కలబోతగా ఆయన అభిమానులు చెప్పుకుంటారు. 2014లో వైఎస్సార్‌సీపీ తరఫున ఆత్మకూరు ఎమ్మెల్యేగా ఘన విజయం సాధించిన ఆయన రాజకీయాలకు కొత్త అయినా అందరితో ఎంతో కలుపుగోలుగా ఉండేవారు. ఒక వ్యక్తి పేరును ఒక్కసారి తెలుసుకుంటే చాలు మరలా ఎప్పుడు కలిసినా పేరుతో పిలిచి వారి అభిమాన నాయకుడిగా పేరు తెచ్చుకున్నారు. 2014-19 మధ్య ప్రతిపక్ష ఎమ్మెల్యేగా ఉన్నా నియోజకవర్గంలో సొంత నిధులతో పనులు చేయించడంతోపాటు మున్సిపల్ అధికారులను వెంటబెట్టుకొని పలు అభివృద్ధి పనులకు సంబంధించి ప్రణాళికలు రూపొందించారు. ఎమ్మెల్యేగా భారీ మెజార్టీతో విజయం సాధించినా సామాన్య కార్యకర్తలను సైతం ఎంతో అభిమానంతో ఆదరించేవారు. మంత్రిగా ఉన్న సమయంలో కరోనా మహమ్మారితో రాష్ట్రం తీవ్ర ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి తీసుకోవాల్సిన చర్యలు, ప్రజలకు అందాల్సిన సంక్షేమం, నిత్యావసరాలు తక్షణమే అందించేలా ఆదేశాలు ఇచ్చిన నాటి ఘటనలను అభిమానులు గుర్తు చేసుకుంటున్నారు. ఏది ఏమైనా అనతికాలంలోనే ఆయన పరిచయం, అనుబంధం జీవితాంతం మరువలేమని అభిమానులు, కార్యకర్తలు, నాయకులు చెబుతున్నారు.



ఆత్మకూరులో రోడ్డు పక్కనే మెట్లపై కూర్చుని టీ తాగుతూ మాట్లాడుతున్న దివంగత మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి (ఫైల్)

ఇంటర్ పబ్లిక్ పరీక్షలకు ఏర్పాట్లు

- నేటి నుంచి అందుబాటులో హాల్‌టికెట్లు
- ఆర్ఐఓ శ్రీనివాసులు

నెల్లూరు(టౌన్): వచ్చే నెల ఒకటో తేదీ నుంచి ఇంటర్ పబ్లిక్ పరీక్షలు జరుగుతాయని, దీనికి సంబంధించి జిల్లాలో ఏర్పాట్లు చేస్తున్నామని ఆర్ఐఓ శ్రీనివాసులు తెలిపారు. నెల్లూరులోని స్టోన్‌హౌస్‌పేటలో ఉన్న కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బుధవారం నుంచి ఆయా కళాశాలల లాగిన్లలో హాల్‌టికెట్లు అందుబాటులో ఉంటాయన్నారు. విద్యార్థులు తీసుకోవాలన్నారు. హాజరు శాతంతో నిమిత్తం లేకుండా హాల్‌టికెట్లను ఇవ్వాలని యాజమాన్యాలను ఆదేశించారు. హాజరు నెపంతో, ఫీజులు చెల్లించలేదనే సాకుతో నిరాకరిస్తే బోర్డు నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈనెల 25వ తేదీ తర్వాత హాల్‌టికెట్లు పబ్లిక్ డొమైన్‌లో లభ్యమవుతాయని, ప్రిన్సిపల్ సంతకం లేకుండానే డౌన్‌లోడ్ చేసుకుని పరీక్షలకు హాజరు కావొచ్చన్నారు. వాయిదాపడిన పర్యావరణ విద్య పరీక్ష అన్ని కళాశాలల్లో ఈనెల 23వ తేదీన జరుగుతుందని, ప్రథమ సంవత్సరం విద్యార్థులు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. ఒకేషనల్ ట్రేడ్ పరీక్షలు ఈనెల 22న జిల్లాలోని 13 కళాశాలల్లో జరుగుతాయన్నారు. సంబంధిత కళాశాలల ప్రిన్సిపల్స్ చర్యలు తీసుకోవాలన్నారు. ఇంటర్ పబ్లిక్ ఎగ్జామ్స్ జిల్లాలోని 81 కేంద్రాల్లో జరుగుతాయన్నారు. ఈనెల 24వ తేదీన నెల్లూరు డీకేడబ్ల్యూ జూనియర్ కళాశాలలో అధికారులతో సన్నాహక సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. 18 ఏళ్లు దాటిన విద్యార్థులను ఓటర్లుగా నమోదు చేయడమే కాకుండా, ఎన్నికల విశిష్టతను తెలియజేయాలన్న లక్ష్యంతో ప్రతి కళాశాలలో ఎలక్టోరల్ లిట్రసీ క్లబ్‌లను ఏర్పాటు చేయాలన్నారు.



మాట్లాడుతున్న శ్రీనివాసులు

మిర్చి ఎగుమతుల్లో మనమే ప్రథమం

- మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

నెల్లూరు(దర్గామిట్ట): 2023-24లో మిర్చి ఎగుమతుల్లో మన రాష్ట్రమే ముందంజలో ఉందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం వైఎస్సార్ ఉద్యాన వర్సిటీ నుంచి వర్చువల్‌గా నిర్వహించిన కార్యక్రమానికి నెల్లూరు నుంచి మంత్రి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రపంచంలోనే మన రాష్ట్రంలో అత్యధికంగా మిరప పంట సాగవుతుందని తెలిపారు. ఈ ఏడాది మిరప సాగుపై అత్యుత్తమ పరిశోధనలు చేపట్టి రైతులకు మేలు చేకూరేలా ఫలితాలు సాధించాలని శాస్త్రవేత్తలను కోరారు. చీడపీడలను తట్టుకునేలా, తక్కువ ఖర్చుతో రైతుకు ఎక్కువ లాభం వచ్చేలా, నాణ్యతమైన సరికొత్త మిరప వంగడాలను తయారు చేయడంపై శాస్త్రవేత్తలు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ఇప్పటికే వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం పరిధిలోని వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు 21 నూతన మిరప వంగడాలను అభివృద్ధి చేశారని, ఇందులో ఏడు రకాలు జాతీయస్థాయిలో గుర్తింపు పొందాయని మంత్రి తెలిపారు. మన రాష్ట్రం నుంచే ఎక్కువగా మిరప పంట విదేశాలకు ఎగుమతి అవుతోందన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యానశాఖ కమిషనర్ ఎస్ఎస్ శ్రీధర్, వర్సిటీ నుంచి వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ జానకిరాం, శాస్త్రవేత్తలు వర్చువల్‌గా పాల్గొన్నారు.

వెంగమాంబ సన్నిధిలో వేలం పాటలు

దుత్తలూరు: నర్రవాడలోని వెంగమాంబ పేరంటాలు సన్నిధిలో వివిధ హక్కులు పొందేందుకు మంగళవారం దేవదాయ శాఖ అధికారులు బహిరంగ వేలం పాటలు, టెండర్ల నిర్వహణ చేపట్టారు. టెంకాయలు, పూజా ద్రవ్యాలు విక్రయించుకునే హక్కును రూ.27,51,000లకు, భక్తులు సమర్పించే చీరలు, రవికలు సేకరించుకునే హక్కును రూ.8.70 లక్షలకు రేబాలకు చెందిన ఒ.శ్రీనాథ్ దక్కించుకున్నారు. ఎండుకొబ్బరి విక్రయించుకునే హక్కును రూ.8.76 లక్షలకు జడదేవికి చెందిన గట్టిబోయిన శివ దక్కించుకున్నారు. పొంగలి షెడ్‌లో గ్యాస్ పొయ్యిలు అద్దెకు ఇచ్చే హక్కును రూ.1,01,000లకు, పండ్లు, పూలమాలలు విక్రయించుకునే హక్కును రూ.3 లక్షలకు నర్రవాడకు చెందిన పి.శివలీల దక్కించుకున్నారు. ఈ బహిరంగ వేలం పాటల ద్వారా దేవస్థానానికి రూ.48,98,000 ఆదాయం సమకూరింది. కార్యక్రమంలో ఆలయ ప్రధాన వ్యవస్థాపక ధర్మకర్త పచ్చవ వెంకటేశ్వర్లు, ఈఓ ఉషశ్రీ, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్) :	152
లేయర్ (లైవ్) :	80
బ్రాయిలర్ చికెన్ :	266
బ్రాయిలర్ స్కిన్‌లెస్ :	294
లేయర్ చికెన్ :	136

పొదలకూరు నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి : రూ.80
సన్నవి : రూ.70
పండ్లు : రూ.25

